# కథ కంచికి

మూర్తి సీటులో కూర్చోగానే క్రితం రోజు కనిపించని కేసు గుర్తుకొచ్చింది. అది ఏమైనా ఈ రోజు వెతికి పట్టుకోవాలి. అసలు ఎలాపోయిందో అర్థం కావడం లేదు. ప్యూనుని అడిగినా లాభం లేదు. ఇక్కడ అక్కడ చూసి 'లేదు సార్' అనేస్తాడు. నిజాయితీగల ఏ ఉద్యోగి అయినా తనకి కావలసిన పేపరు ఏది కనిపించకపోయినా తనే స్వయంగా వెతుక్కోవాలి. మూర్తి చాలా వినయ విధేయతలు, నిజాయితీ గల గుమాస్తా.

అందుకే అతను మరింక ఆలోచించకుండా రికార్డు రూముకేసి నడిచాడు. ఆ రికార్డు రూముకి ఆలనా పాలనా లేదు. అందులో కాగితాలు - ఫైళ్ళు - కేసులు - స్టాక్ ఫైళ్ళు ఒకటేమిటి అన్నీ గుట్టలుగా పోసి వుంటాయి. అందులో ఏమేమి వున్నాయో ఎవరూ చెప్పలేరుగాని పాములూ తేళ్ళూ కరవకుండా చూచుకోమని అందరూ చెప్తారు.

మూర్తి లోపలికి అడుగుపెట్టాడు. నిలువెత్తున నిలబెట్టిన చెక్క పెల్ఫులలో ఎన్నో కేసులు వున్నాయి. కొన్ని తాడుతో కట్టి, కొన్ని కట్టక, మరికొన్ని మూడువంతులు క్రిందకు వ్రేలాడుతున్నాయి. అతడు ఒక్కొక్కటే చూసి మళ్ళీ పెట్టేస్తున్నాడు. చేతినిండా మట్టి మరకలు అవుతున్నాయి. పైపైన చూసి ఎందులో కలిసి వుంటుందో అంచనా వేద్దామనే ఆలోచనలో అటూ ఇటూ చూస్తున్నాడు.

ఇంతలో టప్మని ఒక బరువైన పదార్థం అతని తలమీద పడి భుజాలమీదిగా కిందకి దూకింది. మూర్తి కెవ్వుమని అరిచాడు. పక్కకి తిరిగి చూశాడు. పోతులాంటి

బల్లి. అది సామాన్యంగా ఇళ్ళలో వుండే బల్లికి మూడు రెట్లు పెద్దదిగా వుంది. మూర్తి గడగడ వణికిపోయాడు. బల్లి మీద పడడం అతనికి చాలా అశుభంగా అనిపించింది. అసలే అతడు బల్లిని గురించి వారం రోజుల క్రితమే చాలా చదివాడు. శిరస్సు మీద బల్లి పడితే ఏమిటి? అది కుడి భుజం మీద నుండి జారిపోతే యేమిటి? కనబడని కేసు గురించి దేవుడెరుగు. మూర్తి మాత్రం ఒక్క అంగలో బయటపడ్డాడు. అక్కడేవున్న ఆంజనేయులు "ఏమిటిగురూ" అంటూ పలకరించాడు అతని కంగారు చూసి.

"అబ్బే ఏమీ లేదు, బల్లి" అన్నాడు. భయంతో అతని కంఠం కీచుగా వచ్చింది.

ఆంజనేయులు ఫెళ్ళున నవ్వి "నయం, పాము కానందున సంతోషించు" అన్నాడు.

మూర్తి, ఆంజనేయులు వేసిన జోక్ అరగించుకునే స్థితిలో లేడు. బల్లిని గురించి తను చదివినన్నీ మననం చేసుకుంటున్నాడు. ఎలాగైనా ఈ కీడు పోయేమార్గం చూడాలి. అంటే తను కంచి వెళ్ళాలి. తను వెంటనే వెళ్ళగలడా? పోనీ కంచి వెళ్ళి అక్కడ బంగారుబల్లి, వెండిబల్లి, మట్టిబల్లి అన్ని బల్లులూ తాకిన వారిని వెంటనే ముట్టుకుంటే ఆ కీడు పోతుందంటారు. అయితే వెంటనే కంచివెళ్ళి వచ్చిన వారి కోసం చూడాలి. ఆఫీసులో బాహాటంగా అడిగితే అందరూ నవ్వుతారు. తనని ఆట పట్టిస్తారు. అసలే సగానికి పైగా నాస్తికులు. ఇలాంటి నమ్మకాలంటే మరీ గొడవ చేసి పారేస్తారు. కాబట్టి తెలివిగా విషయం రాబట్టాలి.

తలవంచుకుని పని చేసుకుపోతున్న ప్రసాద్ దగ్గరికి వెళ్ళి "ఏమోయ్ ప్రసాద్! మొన్న తిరుపతి వెళ్ళినప్పుడు ఎక్కడెక్కడికి వెళ్ళావేమిటి?" అన్నాడు మూర్తి లౌక్యంగా.

"ఎక్కడికి వెళ్ళడానికైనా టైమేదీ? పెట్టింది ఒక్క రోజు లీవు. కలిసింది ఒక్క ఆదివారం. తిన్నగా కొండకి వెళ్ళి దేవుడిని చూసి వచ్చే శాము" అన్నాడు.

"అయితే కాళహస్తి వెళ్ళలేదన్నమాట" అన్నాడు మూర్తి ముందే కంచి గురించి అడిగితే బాగుండదని.

"కంచీలేదు, కాళహస్తీ లేదు" అన్నాడు ప్రసాద్ స్థిమితంగా.

అయితే ప్రసాద్‌తో లాభం లేదు అనుకున్నాడు మూర్తి. మూడు సీట్లకి అవతల కూర్చున్న వరలక్ష్మి ఈ మాటలు విని -

"అదేమిటండీ కంచి వెళ్ళకుండా వచ్చారా? కామాక్షి విగ్రహం ఎంత అందంగా వుంటుందో" అంది.

కథా నిలయం
శ్రీకాకుళం

"మీరు వెళ్ళారా" అన్నాడు మూర్తి అర్థంలేని ఆశతో.

"ఆ..... ఎప్పుడో వెళ్ళాను" అంది.

"అక్కడ విశేషాలేమిటండీ"

"ఏమున్నాయి? బల్లులు వుంటాయి. వాటిని తాకితే దోషం ఉండదంటారు."

"మీరు వాటిని తాకారా?"

"ఆ.... ఏదో పెద్దవాళ్ళ కోసం"

ఆ క్షణంలో మూర్తిలో సంఘర్షణ మొదలైంది. తనొక్కసారి వరలక్ష్మిని ముట్టుకుంటే తన దోషం పూర్తిగా పోతుంది. కాని అదెలా సాధ్యం? ఆమె ఎంతో మంచి పిల్ల. అమాయకురాలు. తనంటే ఎంతో గౌరవం ఉన్న మనిషి. వెకిలివేషాలు వేసి ఆమె దగ్గర తన పరువు మంటకలుపుకోలేడు. మరేం చేయాలి?

వరలక్ష్మి కడకొంగు తగిలితే చాలు. ఈ కీడు పోతుందని అతడు ఆరాటపడి పోయాడు.

క్షణక్షణం అతని మనసులో బల్లిపాటు కలహానికి, అనారోగ్యానికి, ఆర్థిక ఇబ్బందులకి, అపనిందలకి, అష్టకష్టాలకి ఎలా సూచనలిస్తుందో గుర్తుకొస్తోంది.

మూర్తికి కనబడని ఫైలు దొరకలేదు గానీ, మనోవ్యాధి పట్టుకుంది. ఇంతలో ఆఫీసరుగారు పిలుస్తున్నట్టు కబురొచ్చింది.

ఆ కేసు గురించే అయ్యుంటుంది అని మనసులో ఊహించగానే మూర్తికి ముచ్చెమటలు పోశాయి. చేసేది లేక అయ్యగారి గదిలోకి అడుగుపెట్టాడు. ఆఫీసరు గారికి నిన్నటి కేసు గుర్తులేదు గాని ఒక టిక్కెట్ల పుస్తకం మూర్తికి ఇచ్చి "అందరి దగ్గరా అయిదేసి రూపాయలు తీసుకో" అన్నారు.

అర్థం కానట్టు చూస్తుండిపోయాడు అన్యమనస్కుడైన మూర్తి.

"కంచి కామాక్షిదేవి ఆలయం బాగుచేయించడం కోసం నిధులు పోగుచేస్తున్నారు. పుణ్యకార్యంలో పాలుపంచుకుంటే పుణ్యమే. చెయ్యవయ్యా చెయ్యి" అన్నారాయన.

వెదకబోయిన తీగె తగిలినట్లనిపించింది మూర్తికి. ఆఫీసరుగారు కంచి వెళ్ళి వుంటారు. నిజం. ఆయన వెళ్ళే వుంటారు. పోనీ ఆయనతో ఈ విషయం చెప్తే - ఛీ - ఇంకా నయం - ఆయన నన్ను పట్టి జడ్డివాడిలాగా అంచనా వేస్తారు. ఆఫీసర్ల దగ్గర ఒక్కసారి ఇంప్రెషన్ పోతే మరిరాదు. ఒకవేళ ఆయన కంచి వెళ్ళినా ఆయన్ని

తనెలా తాగకలడు? అసలా విషయం ఎలా అడగగలడు? తనకీ, ఆయనకీ కొన్ని యోజనాల దూరం వుంది. కొన్ని అగాధాల ఎడం వుంది. ఇది అసాధ్యం. ఆయన ఎంతో దగ్గరగా వున్నారు. ఒక్కసారి కనీసం మునివేళ్ళు తాకినా చాలు. దరిద్రగొట్టు ఫైలు కనిపించినా బాగుండేది. అది చూపిస్తున్నట్లు నటించి, ఆయన చేయి తాకి, ఈ మనోవ్యాధి నుంచి బయటపడేవాడు. పోనీ ఆయన టేబిల్ మీద ఒక్క పేపరయినా లేదు. ఏదయినా చూపించినా, చూసే వుద్దేశ్యం వున్నట్లు ఆయన కనడడం లేదు. ఇప్పుడేమిటి గతి?

"ఓకే మూర్తి – అందరికీ యిచ్చెయ్, కలక్షన్ ఫస్టుకి వచ్చేట్టు చూడు" అంటూ ఆయన లేచారు.

ఆఫీసు మొత్తంలో మూర్తికి కంచికి వెళ్ళినవారు తోటీ క్లర్కు వరలక్ష్మి, ఆఫీసరుగారు ఇద్దరు కనిపించారు. ఇద్దరూ తనకి అందని, అందరానివాళ్ళే, కలహం వస్తుంది. బల్లి నెత్తి మీద పడింది. ఎవరితోనూ అధికంగా మాట్లాడకూడదు. ఇంకేమైనా వస్తుందేమో! చెవుల్లోంచి వేడిగా హోరు వస్తున్నట్లుంది – కళ్ళు మంటలు – జ్వరం రాదు గదా! ఇంక ఆగలేక

"వరలక్ష్మిగారూ! బల్లి మీద పడితే ఏం చేయాలండీ" అన్నాడు తెగించి.

"సింగినాదం, ఏమీ కాదండీ, తినే పదార్థాలలో పడితే మాత్రం విషం. చచ్చిపోతాం" అంది తేలిగ్గా తీసిపారేస్తూ.

నెత్తి మీద పడితేనే తను అశాంతితో చచ్చిపోతున్నాడే, ఇంక అన్నంలో కూడా పడాలా అనుకున్నాడు మూర్తి. రహస్యంగా ఎవరినైనా అడుగుదామంటే, అది వాళ్ళు టాంటాం చేసి, నానా అల్లరీ చేసి మర్నాటి నుంచి తన పేరే బల్లిగా మార్చేయగలరు. అది మూర్తికేం కొత్తగాదు. నిమిషాలు, గంటలు అశాంతిగానే గడిచిపోయాయి. పోయిన ఫైలు దొరకలేదు. వెంటనే కంచి ప్రయాణం కట్టలేదు కనుక కంచి వెళ్ళి వచ్చిన వారి కోసం వేటాడుతూ, మరెవర్నీ ఇంతలో తాకకుండా అయిదు గంటల వరకు గడిపాడు మూర్తి.

అశాంతిగానే ఇంట్లో అడుగుపెట్టి ఎదురొచ్చిన భార్యని చూసి గతుక్కుమన్నాడు మూర్తి. ఇప్పుడేం చెయ్యాలి? ఆఫీసులో అందరికీ అలా అలా దూరంగా గడిపేశాడు. ఇక్కడెలా? అనుకుని ఒక్కక్షణం ఆలోచించి "బల్లి మీద పడితే ఏం చెయ్యాలి" అన్నాడు సూటిగా, చేసేది లేక.

"కంచి వెళ్ళివచ్చిన వారిని తాకితే చాలంటారు. ఏం? మీ మీద పడిందా? నేను చిన్నప్పుడు మా నాయనమ్మతో కంచి..." ఆమె మాటలు పూర్తికాకుండానే మూర్తి ఆమెను గట్టిగా కౌగలించేసుకున్నాడు. ఇన్నాళ్ళుగా ఈ విషయం వాళ్ళ మధ్య రానందుకు బాధపడ్డాడు.

కథ కంచికి వెళ్ళింది గానీ, మూర్తి మాత్రం ఆ రోజు ఇంట్లోనే వుండిపోయాడు.